

నాగులపల్లి సర్పంచ్ చెక్ పవర్ రద్దు

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

మండలంలోని నాగులపల్లి సర్పంచ్ వడిశెట్టి గౌరీరాజేశ్వరి చెక్ పవర్ రద్దయినట్లు ఇఒపిఆర్‌డి భాస్కర్ తెలిపారు. ఈ మేరకు బుధవారం డిపిఒ నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయని చెప్పారు. పంచాయితీ నిధులు దుర్వినియోగం చేశారనే అభియోగంపై నాగులపల్లి గ్రామస్తులు సర్పంచ్‌పై స్పందనలో ఫిర్యాదు చేశారు. సర్పంచ్ బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి 2022 వరకూ జరిగిన లావాదేవీలపై అభ్యంతరాలు వ్యక్తం అయ్యాయి. దీంతో విచారణ చేపట్టిన అధికారులు 6 నెలలపాటు చెక్ పవర్ ను రద్దు చేసినట్లు తెలిపారు. వారం రోజుల్లో దుర్వినియోగం జరగలేదని నిరూపించుకుంటే చెక్ పవర్ పునరుద్ధరించే అవకాశాలు ఉన్నాయని ఆయన తెలిపారు. ఆ బాధ్యతలను ఇఒపిఆర్‌డికి అప్పగించారని తెలిపారు.

ప్రభావం చూపుతారా..!

- మళ్లీ రాజకీయ పున ప్రవేశం చేస్తున్న ముద్రగడ
- త్వరలో వైసిపిలో చేరనున్న కాపు ఉద్యమ నేత



ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

ముద్రగడ అంటే ఒక సంచలనం. ఎన్ని పార్టీలు మారినా, ఎలా వ్యవహరించినా గోదావరి జిల్లాల్లో ఆయనకో ప్రత్యేక ఇమేజ్ ఉంది. గోదావరి జిల్లాలకే కాదు, ఎపిలోనే సీనియర్ నేతల్లో ఆయన ఒకరు. 1978 లోనే అసెంబ్లీ గడపతొక్కిన నేతల్లో చంద్రబాబునాయుడితో పాటు ముద్రగడ మాత్రమే కొనసాగుతున్నారు. గతంలో ఆయన రాష్ట్ర వ్యాప్తంగా ప్రభావితం చేసే స్థాయిలో ఉండేవారు. 2009వ 20014 ఎన్నికల్లో వరుసగా రెండు ఎన్నికల్లో ఓటమి చవిచూసిన తరువాత ఆయన రాజకీయాలకు దూరంగా ఉన్నారు. 2015 నుంచి 2016 మధ్యలో జరిగిన కాపు ఉద్యమంతో మళ్లీ ఆయన పేరు రాష్ట్ర వ్యాప్తంగా మారుమోగింది. 2016 జనవరిలో ఆయన హయాంలో తునిలో జరిగిన కాపు ఐక్య గర్జన సభ, రైలు దగ్ధం ఘటనలతో వార్తల్లోకెక్కారు. ఆ తర్వాత కాపు ఉద్యమం ముందుకు సాగిన దాఖలాలు లేవు. దాంతో సుమారు పదేళ్లుగా ఆయన రాజకీయ కార్యకలాపాలకు దూరంగా ఉన్నారు. అనేక పరిణామాల అనంతరం ముద్రగడ వైసిపి కండువా వేసుకునేందుకు సన్నద్ధమయ్యారు.

ఈ తరుణంలో ఎన్నికల్లో ఆయన ప్రభావంపై సర్వత్రా చర్చజరుగుతుంది. రాజకీయంగా ఆయన గడచిన ఎన్నికల్లో చంద్రబాబును ఓడించాలంటూ ఆయన పిలుపునిచ్చారు. ప్రత్యేకంగా ఏ పార్టీకి ఓటు వేయాలన్నది మాత్రం స్పష్టం చేయలేదు. ఈసారి తన కుమారుడు గిరితో కలిసి ముఖ్యమంత్రి జగన్ సమక్షంలో ఆ పార్టీ కండువా కప్పుకోబోతున్నారు. జనసేన ద్వారా కాపు ఓట్లను దక్కించుకోవాలనే ఆలోచనలో టిడిపి ఉన్నట్లు రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. టిడిపి ఎత్తుగడకు చెక్ పెట్టడం కోసం ముద్రగడను వైసిపి రంగంలోకి దింపింది. ఆయనకు ఎక్కడా సీటును మాత్రం ఖరారు చేయలేదు. ఈ తరుణంలో జనసేన ఓట్లను వైసిపి వైపు ముద్రగడ ఏ మేరకు మళ్లించగలుగుతారనేది ప్రశ్న. ఒక్కకాపు సామాజికవర్గంలోనే కాకుండా ఇతర సామాజిక వర్గాల్లోనూ ఆయనకు అభిమానులు ఉన్నారు. వారి ఓట్లను ఆయన అధికార పార్టీవైపు ఎలా మళ్లిస్తారో చూడాలి. కోనసీమ ప్రాంతంలో ముద్రగడకు అనుచరులు ఎక్కువ. వారిలో చాలా మంది ఇప్పుడు జనసేనలో ఉన్నారు. వారిని ఆయన ఏ మేరకు ప్రభావితం చేస్తారనేది చూడాలి.

వైసిపిలో చేరిక వాయిదా

మాజీ మంత్రి, కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం వైసిపిలో చేరిక వాయిదా పడింది. ఈ మేరకు ఆయన బుధవారం ఒక లేఖను విడుదల చేశారు. ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి పిలుపు మేరకు ఈ నెల 14న తాడేపల్లిలో వైసిపిలో చేరేందుకు నిర్ణయం తీసుకున్నానని తెలిపారు. ఈ సందర్భంగా ర్యాలీగా వెళ్లాలని అనుకున్నామని తెలిపారు. అయితే ఊహించని దానికన్నా భారీస్థాయిలో స్పందన వచ్చిందన్నారు. సిఎం కార్యాలయం వద్ద సెక్యూరిటీ ఇబ్బందుల కారణంగా ఈ కార్యక్రమాన్ని వాయిదా వేశానని, దీనికి తనను క్షమించాలని లేఖలో పేర్కొన్నారు. ఈ నెల 15 లేదా 16వ తేదీల్లో తానొక్కడే తాడేపల్లి వెళ్లి ముఖ్యమంత్రి సమక్షంలో పార్టీలో చేరుతానని తెలిపారు. అందరి ఆశీస్సులు కోరుకుంటున్నానని లేఖలో పేర్కొన్నారు.



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న అఖిలపక్షం నాయకులు

ధర్నాస్థలి నిర్వహణకు అనుమతించాలి

ప్రజాశక్తి - కాకినాడ

రాజ్యాంగం కల్పించిన నిరసన తెలియచేసే హక్కుకు కలెక్టరేట్ వద్ద అనుమతి ఇవ్వాలని అఖిలపక్షం నాయకులు కలెక్టర్‌ను కోరారు. బుధవారం కలెక్టర్ డాక్టర్ కృతికాశుక్లాను అఖిలపక్షం నాయకులు దువ్వా శేషబాబ్జీ అయినాపురపు సూర్య నారాయణ, దూసర్లపూడి రమణరాజు, వడ్లమూరి మంగాదేవి, తదితరులు కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సామాజిక వేత్త దూసర్లపూడి రమణరాజు చేపట్టిన దీక్షతో ప్రకటించిన హామీ ప్రకారం ఆర్‌డిఒ, డిఎస్‌పిలతో రాజకీయ పార్టీల, ప్రజాసంఘాల ప్రతినిధులతో సమన్వయ సమావేశాలు నిర్వహించిన చర్యలు అభినందనీయమని అన్నారు. ఎస్‌పి ఎస్.సతీష్‌కుమార్, అర్బన్ ఆర్‌డిఒ ఇట్ల కిషోర్ వేర్వేరుగా అందించే నివేదికలతో కలెక్టరేట్ వద్ద ధర్నాస్థలి నిర్వహణకు అనుమతించే చర్యలపై కలెక్టర్ నిర్ణయం తీసుకో వాలని కోరినట్లు తెలిపారు. కలెక్టరేట్‌ను ఆనుకుని ఉన్న ముసాఫర్ వీధిని రహదారిగా మార్చి ప్రోటో కాల్ వాహనాలకు ప్రవేశం మార్గం ఏర్పాటు చేస్తే ధర్నాస్థలి వలన ఇబ్బందులుండవని కలెక్టర్‌కు సూచించినట్లు వారు తెలిపారు. అలాగే ట్రావెలర్స్ బంగ్లా నుంచి మార్గం చేయవచ్చనని సూచించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు భైవరపు పద్మావతి, బొబ్బిలి రాజేశ్వర రావు, సిద్దాంతుల కొండబాబు, రియాజ్, కృష్ణ మోహన్, రాజా, మోసా ఏసుబాబు పాల్గొన్నారు.

కాకినాడను కొల్లగొడుతున్న ఎంఎల్‌ఎ

ప్రజాశక్తి - కాకినాడ



కబ్జా చేసిన స్థలాన్ని చూపిస్తున్న వనమాడి

తమ పాలనలో వచ్చిన స్మార్ట్ సిటీ పథకం ద్వారా కాకినాడను ఎంఎల్‌ఎ ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి కొల్లగొడుతున్నాడని మాజీ ఎంఎల్‌ఎ వనమాడి కొండ బాబు ధ్వజమెత్తారు. బుధవారం స్థానిక మెయిన్‌రోడ్డు మసీదు సెంటర్లో ఎంఎల్‌ఎ కబ్జా చేసిన స్థలాన్ని ఆయన మీడియాకు చూపించారు. ఈ సందర్భంగా కొండబాబు మాట్లాడుతూ టిడిపి పాలనలో నగర సుందరీ కరణలో భాగంగా చేపట్టిన రోడ్ల విస్తరణలో స్థలాలు కోల్పోయిన బాధితులకు నష్టపరిహారం టిడిఆర్ బాండ్ల రూపంలో ఇవ్వడం జరిగిందన్నారు. స్థానిక మసీదు సెంటర్లో రాజా రామ్మోహన్‌రాయ్ రోడ్డుకు వెళ్లే కూడలి ప్రాంతంలో కేడిఆర్ బాండ్లు తీసుకుని అదే స్థలంలో వ్యాపార సంస్థకు ఎంఎల్‌ఎ ద్వారంపూడి అద్దెకు ఇవ్వడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. ఎక్కువ రద్దీ ప్రాంతమైన సంత చెరువు నూకాలమ్మ ఆలయాన్ని చేర్చి షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణాన్ని చేపట్టి దానిని కోటి రూపాయలకు ఎంఎల్‌ఎ విక్రయించారని విమర్శించారు. తమ పాలనలో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పెరుగుతున్న జన జనాభాను దృష్టిలో పెట్టుకుని రోడ్ల విస్తరణ కొనసాగించామని, తాజాగా ద్వారంపూడి అధికార బలాన్ని అడ్డం పెట్టుకుని రోడ్లను ఆక్రమించి శాశ్వత కట్టడాలు నిర్మిస్తున్నారని ఆరోపించారు. నగరంలో జరుగుతున్న అక్రమ నిర్మాణాలు, ఆక్రమణలు, కబ్జాలపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశామని చెప్పారు. వీటిపై అధికారులు స్పందించకపోతే వచ్చే తమ ప్రభుత్వ పాలనలో వీటిని వెలికి తీస్తామని హెచ్చరించారు. ఈ పర్య టనలో టిడిపి నగర అధ్యక్షులు మల్లిపూడి వీరు, చింతలపూడి రవి, గదుల సాయిబాబు పాల్గొన్నారు.

పరిపాలన సౌలభ్యం కోసమే సచివాలయ వ్యవస్థ

ప్రజాశక్తి - కాజులూరు



సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న పిల్లి బోస్

పరిపాలన సౌలభ్యం కోసమే సచివా లయ వ్యవస్థను ప్రభుత్వం తీసుకొచ్చిందని రాజ్య సభ సభ్యులు పిల్లి సుభాష్ చంద్రబోస్ అన్నారు. బుధ వారం మండలంలోని దుగ్గుదుర్రులో, కాజులూరు గ్రామాల్లో నిర్మించిన సచివాలయ భవనాలను ఆయన ప్రారంభించారు. ఆయా కార్య క్రమాలకు సర్పంచ్‌లు పోతు వెంకటలక్ష్మి, దండంగి సరోజినీ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందని అన్నారు. ఆ పథకాలను ప్రజలకు చేరువ చేసేందుకు వాలంటీర్, సచివాలయ వ్యవస్థలను ప్రవేశపెట్టిందని తెలిపారు. సంక్షేమ పథకాలను ప్రజలకు అందించడంలో దేశంలోనే ఎపి ప్రభుత్వం అగ్రభాగాన ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతీ సంక్షేమ పథకాన్ని నేరుగా లబ్ధిదారునికే అందేలా చర్యలు తీసుకున్నామని అన్నారు. తద్వారా ప్రతీ పైసా లబ్ధిదారునికే అందుతుందన్నారు. రాబోయే ఎన్నికల్లో వైసిపిని మరోసారి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ పిల్లి సూర్యప్రకాష్, జడ్‌పిటిసి సభ్యులు వనుము వెంకటసుబ్బారావు, ఎంపిపి మాత భారతి, ఎంపిడిఒ ఐ.రత్నరాజ్, పలు గ్రామాల సర్పంచులు నరాల సుబ్బరాజు, పిల్లి కృష్ణమూర్తి, పెద్దిరెడ్డి చంద్రారావు పాల్గొన్నారు.

భాషలపై పట్టుతోనే ఉత్తమ ఫలితాలు

ప్రజాశక్తి - సామర్లకోట



ఉపాధ్యాయులతో సమీక్షిస్తున్న డిఇఒ రమేష్

విద్యార్థులకు భాషలపై పట్టు ఉంటేనే ఉత్తమ ఫలితాలు సాధిస్తారని డిఇఒ పి.రమేష్ అన్నారు. బుధవారం స్థానిక బచ్చుఫౌండేషన్ మునిసిపల్ ఉన్నతపాఠశాలను ఆయన ఆకస్మిక తనిఖీలు చేశారు. పాఠశాలలో ఉపయోగిస్తున్న ఐఎఫ్‌పిల వినియోగం, టాబ్స్ వినియోగంపై విద్యార్థులకు, గైడ్ టీచర్లకు సమీక్ష నిర్వహించారు. పాఠశాలలో నేరుగా 9వ తరగతిలోకి వెళ్లి విద్యార్థులను ఐఎఫ్‌బిల కోసం, బైజుస్ ట్యాబుల వినియోగం కోసం అడిగి తెలుసుకున్నారు. బైజుస్ కంటెంట్ వినియోగంలో ముందున్న విద్యార్థులను అభినందించారు. పిఎం శ్రీ పాఠశాలల్లో బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్ ఉన్నందున సైన్స్‌ల్యాబ్‌ను ఏర్పాటు చేసుకునే వెసులుబాటు వచ్చిందన్నారు. తదుపరి ఎన్ఎంఎంఎస్, 10వ తరగతి ఫలితాలు కోసం సమీక్ష నిర్వహించి, ఉపాధ్యాయులకు తగు సూచనలు చేశారు. క్వాంటిటీ ఆఫ్ రిజల్ట్స్ కంటే క్వాలిటీ ఆఫ్ రిజల్ట్స్‌కు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. పరిశుభ్రతకు నెలలో ఒకరోజు ప్రత్యేకంగా తప్పక కేటాయించాలని, మంచి వాతావరణంలో విద్య అందించేలా చూడాలని ఆదేశించారు. సమీక్ష అనంతరం హెచ్ఎం, ఉపాధ్యాయుల పనితీరు పట్ల సంతృప్తిని వ్యక్తం చేస్తూ హెచ్ఎం తోటకూర సాయి రామకృష్ణను శాలువాతో సత్కరించారు. ఈ పర్యటనలో ఎంఇఒ -2 పి.పుల్లయ్య, సిఆర్‌పి తనూజ పాల్గొన్నారు.

జెసి రామ్‌సుందర్‌రెడ్డి బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - కాకినాడ



పశ్చిమ గోదావరి జిల్లా నుంచి కాకినాడ జిల్లా జాయింట్ కలెక్టర్‌గా బదిలీపై వచ్చిన ఎన్.రామ్‌సుందర్ రెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ డాక్టర్ కృతికాశుక్లాను ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లా ప్రాధాన్యత అంశాలపై ఇరువురు చర్చించారు. నూతన జేసీగా బాధ్యతలు స్వీకరించిన రామ్ సుందర్ రెడ్డిని డిఆర్ఒ డి.తిప్పేనాయక్, కమిషనర్ జె.వెంకట రావు, కలెక్టరేట్ ఎఒ జిఎస్ఎస్.శ్రీనివాసు, పౌరసరఫరాల సంస్థ, సర్వే, హౌసింగ్, ఇతర శాఖల అధికారులు, కలెక్టరేట్ వివిధ విభాగాల అధిపతులు పలువురు ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కలెక్టరేట్ లోని వివిధ విభాగాలను డిఆర్ఒతో కలిసి పరిశీలిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజల సహకారంతో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు.

ఐక్య పోరాటాలతోనే హక్కుల సాధన

ప్రజాశక్తి - కాకినాడ



సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా అధ్యక్షుడు శేషబాబ్జి

కార్మికుల ఐక్య పోరాటాల ద్వారానే హక్కుల సాధన సాధ్యం అవుతుందని సిఐటియు జిల్లా అధ్యక్షులు దువ్వా శేషబాబ్జి అన్నారు. బుధవారం స్థానిక జిజిహెచ్ ప్రాంగణంలో సిహెచ్. విజయ్ కుమార్ అధ్యక్షతన జరిగిన శానిటేషన్ వర్కర్స్ జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. జిజిహెచ్ శానిటేషన్ వర్కర్స్ నిర్వహించిన పోరాటం స్ఫూర్తిదాయకంగా ఉందన్నారు. అయితే ధరలు విపరీతంగా పెరుగుతున్నాయని, అందుకు తగిన విధంగా కార్మికుల వేతనాలు పెరగడం లేదన్నారు. పాలకుల హామీ ప్రకారం కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు, కార్మికులు అందరినీ నిర్దిష్ట సమయంలో పర్మినెంట్ చేయాలని సిఐటియు డిమాండ్ చేస్తోందన్నారు. ప్రస్తుత పోరాటం అనుభవాలతో, సంఘటితమై భవిష్యత్తులో మరిన్ని హక్కులు సాధించుకోవాలని పిలుపు నిచ్చారు. సిఐటియు నగర నాయకులు పలివెల వీరబాబు, మలక వెంకటరమణ మాట్లాడుతూ జిజిహెచ్ శానిటేషన్ వర్కర్స్ ఉద్యమానికి సంఘీభావం తెలిపి, అండగా నిలబడిన సంఘాలు, అధికారులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ సమావేశంలో యూనియన్ నాయకులు జె.శేషు, ఎస్.వాసు, జె.లక్ష్మీప్రియ, కృష్ణవేణి, మంగ తాయారు, కుమారి, శ్రీకాంత్, ఏసు, దుర్గా ప్రసాద్, వివిఎన్‌కుమార్ పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధితోనే ప్రజలకు సౌకర్యాలు

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి



శంకుస్థాపన చేస్తున్న కాకినాడ ఎంపీ గీత

గ్రామాలు వేగంగా అభివృద్ధి చెందితేనే ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించడానికి అవకాశం ఉంటుందని ఎంపి, వైసిపి పిఠాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ వంగ గీత అన్నారు బుధవారం శ్రీరాంపురం పంచాయతీ పరిధిలో ఉన్న ముమ్మిడివారిపాడు గ్రామంలో పలు సిసి రోడ్లకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రూ.10 లక్షల వ్యయంతో సిసి రోడ్డుకు శంకుస్థాపన చేయడం జరిగిందని తెలిపారు. ముమ్మిడివారు పాడు నుంచి బీచ్ రోడ్డుకు వెళ్లే రహదారికి రూ.1.10 కోట్లు అవసరం కాగా, సిఎస్ఆర్ ఫౌండేషన్ నుంచి అరబిందో యాజమాన్యం సహకారంతో బీచ్ రోడ్డు వరకు రోడ్డు నిర్మాణం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపిలు మాదిరెడ్డి దొరబాబు, చెట్టుబత్తిన సురేష్ కుమార్, శ్రీరాంపురం సర్పంచ్ రావి రమేష్, నక్క మణికంఠ, వైసిపి రాష్ట్ర నాయకులు రావు చిన్నారావు, మండల అధ్యక్షులు ఆనాల సుదర్శన్, వెంగల సుబ్బారావు పాల్గొన్నారు.

పొంచివున్న ప్రమాదం..!

-భయపెడుతున్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

ప్రజాశక్తి - సామర్లకోట



ట్రాన్స్‌ఫార్మర్(ఇన్‌సెట్‌లో ఎర్త్ వద్ద వస్తున్న మంటలు

నిత్యం జనసంచారం వాహనాల రద్దీతో ఉండే టిటిడి కళ్యాణ మండపానికి వెళ్లే రహదారిలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ప్రమాదం పొంచి ఉంది. ఎర్త్ కోసమని ఏర్పాటు చేసిన పైపునకు విద్యుత్ సరఫరా వస్తుండటంతో ప్రజలు భయపడుతున్నారు. నిత్యం ప్రజలతో రద్దీగా ఉండే ప్రదేశం కావడంతోపాటు చెంతనే ఉన్న అన్నా క్యాంటీన్ భవనంలో జగ్గమ్మగారి పేటకు చెందిన మున్సిపల్ పాఠశాల ఉంది. ఆ విద్యార్థులు సైతం విశ్రాంతి సమయంలో ట్రాన్స్‌ఫార్మర్ సమీప ప్రాంతంలోనే ఆటలు ఆడుకుంటూ గడుపుతున్నారు. ఎవరు గమనించలేని విధంగా భూమిలో పాతిపెట్టిన ఎర్త్ పైపునకు నేరుగా విద్యుత్ సరఫరా అవుతూ చిన్న బల్బు మాదిరిగా స్పార్క్ వచ్చి ఉంటుంది. పగటి సమయంలో దాని కాంతి అంతగా కనిపించకుండా ఉంటున్నందున విద్యార్థులు, ప్రజలు దానిని గమనించడం కష్టతరంగా మారింది. ఈ పరిస్థితుల్లో విద్యుత్ అధికారులు తక్షణం స్పందించి ఎర్త్ పైపునకు వస్తున్న విద్యుత్‌ను క్రమబద్ధీకరించి ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ రక్షణ వలయాన్ని ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

జాతీయ స్థాయి ఇన్‌స్పైర్‌కి ప్రాజెక్టు ఎంపిక

ప్రజాశక్తి - కాకినాడ



జ్ఞాపికను అందుకుంటున్న విద్యార్థిని

జాతీయస్థాయి ఇన్‌స్పైర్ మనాక్ పోటీలకు జిల్లా నుంచి ఒక ప్రాజెక్టు ఎంపికైందని జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాస్ వినీల్ ఒక ప్రకటనలో తెలిపారు. కాకినాడ అర్బన్ మండలం గోడారి గుంట మునిసిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాలకు చెందిన గుత్తుల అనుష్క రూపొందించిన సీడర్ ఫర్ స్మాల్ స్కేల్ ఫార్మర్స్ అనే ప్రాజెక్టు జాతీయస్థాయికి ఎంపికయ్యిందన్నారు. చిత్తూరు జిల్లా విద్యాశాఖ అధికారి దేవరాజు చేతుల మీదుగా వీరు ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు అందుకున్నారని చెప్పారు. ఈనెల 11 నుంచి 13వ తేదీ వరకు చిత్తూరు జిల్లా పలమనేరులో రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్ మనక్ పోటీలు జరిగాయని, రాష్ట్రస్థాయి నుంచి 240 ప్రాజెక్టులు ప్రదర్శించగా అందులో 24 ప్రాజెక్టులు జాతీయస్థాయికి ఎంపిక చేశారని తెలిపారు. జాతీయ స్థాయికి ఎంపిక అయ్యేటట్లు ప్రాజెక్టులు రూపొందించిన విద్యార్థిని గుత్తుల అనుష్కను, వారికి గైడ్ చేసిన ఉపాధ్యాయుడు చంద్రారెడ్డిని ఆర్‌జెడి జి.నాగమణి, జిల్లా విద్యాశాఖాధికారి పి.రమేష్, ఉప విద్యాశాఖాధికారి ఆర్‌జె.డానియల్ రాజు, జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాస్ వినీల్ అభినందించారు.

సూపర్ సిక్స్ పథకాలపై టిడిపి ప్రచారం

ప్రజాశక్తి - పెదపూడి



వృద్ధురాలికి వివరిస్తున్న మనోజ్‌రెడ్డి

టిడిపి సూపర్ సిక్స్ పథకాలపై ప్రచారాన్ని నిర్వహించారు. బుధవారం మండలంలోని అచ్యుతాపురత్రయం గ్రామంలో టిడిపి యువ నాయకులు నల్లమిల్లి మనోజ్‌రెడ్డి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి టిడిపి చేపట్టబోయే పథకాలపై వివరించారు. ప్రతి ఇంటికి యేడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలెండర్లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ప్రతి మహిళకు నెలకు రూ. 1500 నగదు ఇస్తారన్నారు. రైతుకు రూ.20 వేలు పెట్టుబడి నిధి, తల్లికి వందనం పేరుతో ప్రతి విద్యార్థికి రూ.15 వేలు నగదు తదితర పథకాలను అమలు చేస్తుందన్నారు. రెండు నెలల్లో టిడిపి ప్రభుత్వం వస్తుందని ప్రతి ఒక్కరూ మద్దతు పలకాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి, జనసేన నాయకులు జుత్తుక కృష్ణ, ఆర్ నాగు, పుట్ట గంగాధర్‌చౌదరి పాల్గొన్నారు.

సచివాలయ భవనం ప్రారంభం

ప్రజాశక్తి - కరప



సచివాలయాన్ని ప్రారంభిస్తున్న సత్యనారాయణ

మండలంలోని వేళంగి గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని కాకినాడ రూరల్ అభివృద్ధి కమిటీ ఛైర్మన్ కురసాల సత్యనారాయణ ప్రారంభోత్సవం చేశారు. బుధవారం గ్రామ సర్పంచ్ సవిలే నీలిమ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సచివాలయ వ్యవస్థ ద్వారా గ్రామాల్లో గ్రామ స్వరాజ్యం వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి పెంకే శ్రీలక్ష్మి, జడ్‌పిటిసి సభ్యులు వై.సుబ్బారావు, వైసిపి మండల అధ్యక్షులు చింతా ఈశ్వరరావు, నెడ్ క్యాప్ డైరెక్టర్ సాదే విజయలక్ష్మి, వైస్ ఎంపిపి బొమ్మతి వీరరాఘవులు, పంచాయతీ కార్యదర్శి పి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బాల్య వివాహాలపై కఠిన చర్యలు

ప్రజాశక్తి - కాకినాడ రూరల్



సమావేశంలో మాట్లాడుతున్న ఉషారాణి

బాల్య వివాహాలపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని మహిళా సంరక్షణ కార్యదర్శి కే. ఉషారాణి అన్నారు. బుధవారం బోటు క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్న వయసులోనే వివాహం చేయడం వల్ల శారీరిక పరిపక్వత సాధించక ముందే వారు తల్లులవుతున్నారని అన్నారు. చిన్నతనంలోనే గర్భం దాల్చడం వలన అకాల మరణాలు సంభవిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కొంతమంది పిల్లలు బలహీనంగా పుడతారని అన్నారు. ఆడపిల్లలకు 18, అబ్బాయికి 21 ఏళ్లు నిండిన తర్వాత మాత్రమే వివాహానికి అర్హులని అన్నారు. బాల్య వివాహం చేస్తే కుటుంబ సభ్యులతోపాటు ఆ వివాహానికి హాజరైన వారందరి మీద కేసు నమోదు చేసే అవకాశం ఉందని ఉషారాణి తెలిపారు. ఈ కార్యక్రమంలో అడబాల రత్న ప్రసాద్, రవిశంకర్ పట్నాయక్ పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



అలా అనకండి సార్..! మనకెవ్వరూ ఓటెయ్యరు!!!

టిడిపిలోకి వైసిపి జడ్‌పిటిసి

ప్రజాశక్తి - గండేపల్లి



టిడిపి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న జ్యోతుల నెహ్రూ

మండల జడ్‌పిటిసి, వైసిపి నాయకులు పరిమి మంగతాయారు, ఆమె భర్త పరిమి బాబు వారి అనుచరులతో కలిసి టిడిపిలో చేరారు. బుధవారం మండలంలోని ఎన్‌టి రాజాపురం గ్రామంలో ఈ కార్యక్రమం జరిగింది. జడ్‌పిటిసి స్వగ్రామమైన ఎన్‌టి రాజాపురంకు టిడిపి రాష్ట్ర ఉపాధ్యాక్షుడు జ్యోతుల నెహ్రూ, జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ చేరుకున్నారు. ఈ సందర్భంగా వారికి జడ్‌పిటిసి ఆధ్వర్యంలో వారి అనుచరులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం బిక్కిన గంగాధర్, పరిమిరాజు, సుంకవిల్లి రమేష్, తదితరులతో కలిసి వారు టిడిపిలో చేరారు. ఈ సందర్భంగా పరిమి బాబు మాట్లాడుతూ అభివృద్ధి ప్రధాత జ్యోతుల నెహ్రూని గెలిపించుకోవడానికి మళ్లీ ఈ పార్టీలో చేరుతున్నానని అన్నారు. నెహ్రూ మాట్లాడుతూ నా మిత్రులందరికీ ఈ మూడు నెలల కాలం నుంచి మళ్లీ నా వద్దకు వస్తున్నారని, ఇంకా అనేకమంది రావడానికి సిద్ధంగా ఉన్నారని అన్నారు. విధ్వంసకర పాలన చేస్తున్న జగన్‌రెడ్డిని గద్దె దించటానికి ఈరోజు టిడిపి, జనసేన, బిజెపి కలిసి పనిచేస్తున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో కోర్పు లచ్చయ్య దొర, ఎస్‌విఎస్ఎస్.అప్పలరాజు, పోతుల మోహనరావు, తోట గాంధీ, తోట రవి, కోర్పు సాయితేజ, మారిశెట్టి భద్రం, జాస్తి వసంత్, కొత్త కొండబాబు, కుంచే రాజా, కందుల చిట్టిబాబు, తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు హక్కుపత్రాల పంపిణీ



పట్టాలను పంపిణీ చేస్తున్న వరుపుల

ప్రజాశక్తి - ఏలేశ్వరం

నవరత్నాలు -ఇళ్ల పథకంలో ఎంపికైన లబ్ధిదారులకు వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ వరుపుల సుబ్బారావు, ఎంఎల్‌సి అనంత ఉదయభాస్కర్ హక్కు పత్రాలను పంపిణీ చేశారు. బుధవారం నగర పంచాయతీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమం ఛైర్‌పర్సన్ అలమండ సత్యవతి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వ పాలనలో మహిళలకు డ్వాక్రా రుణమాఫీ, అమ్మ ఒడి, తల్లుల ఖాతాలలో విద్యాదీవెన, వసతి దీవెన వంటి పథకాలను అందించినట్లు తెలిపారు. అనంతరం జె.అన్నవరం గ్రామానికి చెందిన టిడిపి నాయకుడు బొరుసు శ్రీనివాస చక్రవర్తి తన అనుచరులతో వైసిపిలో చేరారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ అధ్యక్షుడు వి.సత్యసూరిబాబు, అలమండ చలమయ్య, వైస్ ఛైర్‌పర్సన్‌లో శిడగం త్రివేణి, మసిరపు బుజ్జి, కౌన్సిలర్లు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

130 క్వింటాళ్ల పిడిఎస్ బియ్యం సీజ్

ప్రజాశక్తి - గోపాలపురం

వ్యాన్‌లో అక్రమంగా తరలిస్తున్న 130 క్వింటాళ్ల పిడిఎస్ బియ్యాన్ని సీజ్ చేశామని, ఈ మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ కె.సతీష్‌కుమార్ తెలిపారు. పిడిఎస్ అక్రమ రవాణాపై అందిన సమాచారం మేరకు సివిల్ సప్లయిస్ డిటి తాటిపూడి దివాకర్, పోలీస్ సిబ్బందితో కలిసి గోపాలపురం శివారు పెట్రోల్ బంక్ వద్ద వాహన తనిఖీలు నిర్వహించారు. ఒక వ్యాన్‌లో 130 క్వింటాల పిడిఎస్ రైస్ పట్టుకున్నట్లు తెలిపారు. వాటి విలువ సుమారు రూ.2.08 లక్షలు ఉంటుందని తెలిపారు. పిఠాపురానికి చెందిన అల్లుముల్లు రాముడు ఆధుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

సారా విక్రయిస్తున్న మహిళ అరెస్ట్

ప్రజాశక్తి-కడియం

మండలంలోని మాధవరాయుడుపాలెం పంచాయతీ శివారు చైతన్య నగర్‌లో సారాను విక్రయిస్తున్న మహిళను పోలీసులు అరెస్టు చేశారు. సిఐ బి.తులసీధర్ ఆధ్వర్యంలో ఎస్ఐ బివిఎస్.దుర్గాప్రసాద్ సిబ్బందితో కలిసి బుధవారం దాడులు నిర్వహించారు. చైతన్యనగర్‌లో నాటుసారా అమ్ముతున్న పుల్లూరి సీతారత్నంను అరెస్టు చేశామని సిఐ తెలిపారు. ఆమె నుంచి 20 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. కేసు నమోదు చేసి న్యాయస్థానంలో హాజరుపరిచామన్నారు.



మొక్కను నాటుతున్న గంగాధర్ దంపతులు

ప్రకృతి పరిరక్షణకు కృషి అవసరం

ప్రజాశక్తి - గండేపల్లి

మండలం సూరంపాలెం ఆదిత్య ఇంజనీరింగ్ క్యాంపస్ మీడియా మేనేజర్, జాతీయ పర్యావరణ మిత్ర అవార్డు గ్రహీత తోటకూర గంగాధర్ తన పెళ్లి రోజు సందర్భంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపెళ్లి రోజు సందర్భంగా మొక్కలు నాటడం ఆనందంగా ఉందని తెలిపారు. ప్రతీ ఒక్కరూ ప్రకృతి పరిరక్షణకు మొక్కలు నాటడంతోపాటు, వాటిని సంరక్షించాలని కోరారు. ఈ సందర్భంగా ఆదిత్య విద్యాసంస్థల వైస్ చైర్మన్ డాక్టర్ ఎన్.సతీష్‌రెడ్డి, క్యాంపస్ డైరెక్టర్ డాక్టర్ ఎం.శ్రీనివాస రెడ్డి, ఆదిత్య విద్యాసంస్థల కన్సల్టెంట్ డైరెక్టర్ మేడపాటి భాస్కరరెడ్డి, క్యాషియర్ పెనుమల్లు సత్యనారాయణరెడ్డి, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత తోటకూర సాయి రామకృష్ణ, ఆదిత్య సిబ్బంది ఆయనకు పెళ్లిరోజు శుభాకాంక్షలు తెలిపారు.

తాగునీటి ఇబ్బంది లేకుండా చేస్తా

ప్రజాశక్తి - పెద్దాపురం

నియోజకవర్గ పరిధిలోని మెట్ల గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులు లేకుండా ఎప్పటికప్పుడు అధికారులు చర్యలు తీసుకుంటున్నారని వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ దవులూరి దొరబాబు అన్నారు. బుధవారం మండలంలోని చిన్న బ్రహ్మదేవం గ్రామంలో జలజీవన్ పథకంలో రూ.34 లక్షల వ్యయంతో నిర్మించిన మంచినీటి పథకాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంచినీటి సమస్య పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇచ్చామన్నారు. ఈ కార్యక్రమంలో జడ్‌పిటిసి సభ్యులు గవరసాన సూరిబాబు, ఎంపిపి పెంకె సత్యవతి, వైస్ ఎంపిపి మిర్యాల రాజా, నల్లల నాగేంద్రబాబు, పలువురు శ్రీను, పుట్ట వెంకటరావు, అర్జుమ్యాన్ జెఇ అప్పలరాజు, పంచాయతీ, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

ధూమపాన వ్యతిరేక దినోత్సవం

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

స్థానిక ఎపిఎంఏసి కాలనీలో ప్రపంచ ధూమపాన వ్యతిరేక దినోత్సవాన్ని నిర్వహించారు. కాకినాడ ఐడిఎ సభ్యుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఐడిఎ రాష్ట్ర సిడిహెచ్ కన్వీనర్ డాక్టర్ అద్దాల మాట్లాడారు. ధూమపానం యొక్క దుష్పరిణామాల ప్రభావాల గురించి ప్రతీ ఒక్కరికీ అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఆరోగ్యకరమైన జీవన విధానాలను ప్రోత్సాహించడానికి కృషి చేయాలని తెలిపారు. డాక్టర్ శ్రీవల్లి మాట్లాడుతూ ధూమపానం అనేక అనారోగ్యాలకు కారణమని అన్నారు. ఈ సందర్భంగా ధూమపానం మానేయాలనే వారికి నికోటిన్ అనే చూయింగ్ గమ్స్‌ను అంద చేశారు. ఈ కార్యక్రమంలో అడబాల రత్నప్రసాద్, డాక్టర్ నాగేంద్ర, డాక్టర్ చైతన్య, డాక్టర్ సింహా పాల్గొన్నారు.

టిడిపిలో పలువురి చేరిక

ప్రజాశక్తి - పెద్దాపురం

టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రాజా సూరిబాబురాజు తనయుడు దినేష్‌రాజు ఆధ్వర్యంలో పలువురు టిడిపిలో చేరారు. బుధవారం జరిగిన ఈ కార్యక్రమంలో ఎంఎల్‌ఎ నిమ్మకాయల చిన రాజప్ప పాల్గొని వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా రాజప్ప మాట్లాడుతూ రాష్ట్ర భవిష్యత్తు కోసం టిడిపితో కలిసి పనిచేస్తే వారికి ద్వారాలు తెరిచే ఉంటాయన్నారు. పార్టీ సీనియర్ నాయకులు కార్యకర్తలు పార్టీలో కొత్తగా చేరే వారిని కలుపుకుని రాబోయే ఎన్నికల్లో టిడిపి విజయం కోసం కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో నిమ్మకాయల రంగనాగ్, రాజా సూరిబాబురాజు, రంది సత్యనారాయణ, తూతిక రాజు, కొరుపురి రామ, బొడ్డు ఉదయ కుమార్, కందుల విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

బకాయిలు వసూలు చేయకపోతే ఛార్జ్ మెమో

ప్రజాశక్తి - పెద్దాపురం

ఇంటి పన్నులు, ఖాళీ స్థలాల పన్నులు నిర్ణీత సమయంలో కట్టించకపోతే ఛార్జ్ మెమో ఇస్తామని మున్సిపల్ రీజనల్ డైరెక్టర్ కం అప్పిలేట్ కమిషనర్ సత్యనారాయణ హెచ్చరించారు. బుధవారం ఆయన పెద్దాపురం మున్సిపల్ కార్యాలయంలో సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఇంటి పన్నులు, ఖాళీ స్థలాల పన్నుల వసూలుపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిఒ నెంబర్ 35 ద్వారా వడ్డీ రాయితీ కల్పించినందున సిబ్బంది పట్టణ ప్రజలకు అవగాహన కల్పించి పూర్తిస్థాయిలో పన్నులు వసూలు చేయాలన్నారు. ఈ రాయితీ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సూరంపాలెం పన్నులు వసూలు చేయకపోతే ఛార్జ్ మెమోలు ఇవ్వాల్సివస్తుందని హెచ్చరించారు. ఈ సమావేశంలో మున్సిపల్ రెవెన్యూ ఆఫీసర్ చంద్రశేఖర్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

యానాం వార్తలు



ర్యాలీని ప్రారంభిస్తున్న ఆర్‌ఎం మునిస్వామి

ఓటు హక్కుపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి - యానాం

ఓటు హక్కును ప్రతీ ఓటరు విధిగా వినియోగించుకోవాలని కోరుతూ యానాం డాక్టర్ ఎస్ఆర్‌కె ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల విద్యార్థులు భారీ ర్యాలీ నిర్వహించారు. బుధవారం కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ర్యాలీని ప్రాంతీయ పరిపాలనాధికారి ఆర్.మునిస్వామి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటు హక్కు ఆవశ్యకతను ప్రతీ ఓటరు తెలుసుకోవాలని కోరారు. ర్యాలీలో విద్యార్థులు ప్లకార్డులు ప్రదర్శిస్తూ పాల్గొన్నారు. ఓటు హక్కును విధిగా వినియోగించుకోవాలని విద్యార్థులు నినాదాలు చేశారు. ఈ ర్యాలీ చిన్నా సెంటర్, పిల్లారాయవీధి, జిన్నర్ సెంటర్ తదితర ప్రధాన వీధుల్లో సాగింది. అలాగే మధ్యాహ్నం ఐవిఎంలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పిఒలు డాక్టర్ సి.నరేష్, ఎస్.శ్రీనివాస్, అధ్యాపకులు పాల్గొన్నారు.



పార్కును శుభ్రపరుస్తున్న వాలంటీర్లు

మున్సిపల్ పార్కులో పరిశుభ్రత

ప్రజాశక్తి - యానాం

యానాం అంబేద్కర్ నగర్‌లోని మున్సిపల్ పార్కును స్థానిక డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు శుభ్రపరిచారు. ఈ కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపల్ పి.వేలాయుధం ప్రారంభించారు. ఎన్ఎస్ఎస్ పిఒ అనిల్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రత్యేక శిబిరంలో భాగంగా పేరుకుపోయిన చెత్తా చెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలను, తుప్పలను తొలగించారు. అనంతరం ఓటు హక్కు వినియోగంపై అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఓటు హక్కును ప్రతీ ఓటరు విధిగా వినియోగించుకోవాలని వాలంటీర్లు నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ రీజనల్ కో-ఆర్డినేటర్ సుధాకర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ల్యాబ్ టెక్నీషియన్ల రక్తదానం

ప్రజాశక్తి - ఏలేశ్వరం

నేషనల్ ల్యాబ్ టెక్నీషియన్స్ డే పురస్కరించుకుని బుధవారం స్థానిక ప్రభుత్వాసుపత్రిలో ప్రయివేటు, ప్రభుత్వ ల్యాబ్ టెక్నీషియన్లు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శైలజ మాట్లాడుతూ రక్తదానం ద్వారా ఒక్కొక్కరు మరో ముగ్గురి ప్రాణాలను కాపాడిన వారు అవుతారన్నారు. ఈ శిబిరంలో ల్యాబ్ టెక్నీషియన్లు 30 యూనిట్లు రక్తం దానం చేయడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సౌమ్య, ప్రయివేట్, ప్రభుత్వ ల్యాబ్ టెక్నీషియన్లు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలంలోని పలుగ్రామాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఎంఎల్ఎ పొన్నాడ సతీష్‌కుమార్ శంకుస్థాపనలు చేశారు. అలాగే పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. బుధవారం మండలంలోని తాళ్లరేవు, జి.వేమవరం, చొల్లంగి, చొల్లంగిపేట, తదితర ప్రాంతాల్లో జలజీవన్ మిషన్ రూ.15 కోట్లు, సిఎస్ఆర్ నిధులు రూ 3.19 కోట్లతో నిర్మించిన వాటర్ పైపులైన్లను ప్రారంభించారు. అనంతరం పిల్లంక, ఇంజరం, తాళ్ళరేవు వన్‌లో నిర్మించిన రైతు భరోసా కేంద్రాలను ప్రారంభించారు. నీల పల్లి గ్రామంలో రెడ్డి మురళీమోహన్ కళ్యాణమండపాన్ని ఆయన ప్రారంభించారు. పోలేకురు పంచాయతీలో డ్రెయిన్, రోడ్లను ప్రారంభించారు. ఈ కార్యక్రమాల్లో జడ్‌పిటిసి సభ్యులు దొమ్మేటి సామ్యూల్‌సాగర్, కాదా గోవిందకుమార్, రెడ్డి సతీష్, దున్న జనార్ధనరావు, దున్న శ్రీకాంత్, మట్టపర్తి లోవరాజు, పంపన రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి

ప్రజాశక్తి - తాళ్లరేవు

గత ఏడాది రైతులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని, కౌలు రైతులు ధర్నా నిర్వహించారు. బుధవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో జరిగిన ధర్నాలో సంఘం జిల్లా కార్యదర్శి వళ్ల రాజుబాబు మాట్లాడారు. రైతులకు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కిన కేంద్ర ప్రభుత్వం తిరిగి ఆ నల్లచట్టాలను దొడ్డి దారిన తీసుకొచ్చే ప్రయత్నం చేస్తుందన్నారు. గత 20 రోజులుగా ఢిల్లీ, హర్యానా, పంజాబ్ రాష్ట్రాల్లో ఆందోళన జరుగుతూ ఉంటే రైతులను చంపే ప్రయత్నం చేస్తుంది తప్ప, హామీలను అమలు చేయడం లేదన్నారు. ఈనెల 14వ తేదీన ఢిల్లీలో లక్షలాది మందితో నిరసన కార్యక్రమం జరుగునున్న నేపథ్యంలో కాకినాడ కలెక్టరేట్ వద్ద నిర్వహించే ధర్నాలో రైతులు, కౌలు రైతులు, ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు చల్లా సంతోష్ కుమార్, కౌలు రైతులు దొరబాబు, గణపతి, రెడ్డి రాము, మారెళ్ళ నరసింహమూర్తి, పెద్దిరెడ్డి వెంకటేశ్వర్లు, బూరెల సత్తిబాబు పాల్గొన్నారు.

లక్ష్యాన్ని మించి రుణాల కల్పన : కలెక్టర్

ప్రజాశక్తి - కాకినాడ



బ్యాంకర్లతో సమీక్షిస్తున్న కలెక్టర్ కృతికాశుక్లా

జిల్లాలో నిర్ధేశం చుకున్న లక్ష్యాన్ని మించి రుణ కల్పన చేసినట్లు కలెక్టర్ డాక్టర్ కృతికాశుక్లా అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో బ్యాంకర్లు, జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులతో జిల్లా స్థాయి రివ్యూ కమిటీ, కన్స ల్టేటీవ్ కమిటీ సమావేశాలు కలెక్టర్ అధ్యక్షతన జరిగాయి. ఈ సమా వేశంలో గత త్రైమాసాంతానికి జిల్లాలో వివిధ రంగాలకు రుణాల కల్పన ప్రగతి, బ్యాంకింగ్ సేవల విస్తరణ తదితర అంశాలపై సమీ క్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ డిశంబర్ 31తో ముగిసిన త్రైమాసాంతం వరకూ జిల్లాలో వివిధ ప్రాధాన్యతా రంగాలకు నిర్ధేశించిన రూ.17,073 కోట్ల రుణాల కల్పన లక్ష్యాన్ని మించి రూ.17,739 కోట్ల మేరకు రుణాలు కల్పించినట్లు తెలిపరు. 104 శాతం ప్రగతి సాధించినందుకు బ్యాంకర్లు ను, జిల్లా అధికారులను అభినం దించారు. పిఠాపురం బిఒబి శాఖలో స్వయం సహాయ బృందాలకు రుణాల జారీలో అవకతవకలకు పాల్పడిన వారిపై తగు చర్యలు చేపట్టాలని బ్యాంకు, డిఆర్‌డిఎ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ సమా వేశంలో ఎంఎల్‌సి కర్రి పద్మశ్రీ, ఆర్‌బిఐ లీడ్ డిస్ట్రిక్ ఆఫీసర్ పి.పూర్ణిమ, కమిటీ కన్వీనర్, యూని యన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజినల్ హెడ్ కాకి సాయిమనోహర్, డిఆర్‌డిఎ పీడీ శ్రీరమణి పాల్గొన్నారు.

మహిళలపై పాలకులకు చిత్తశుద్ధి కరువు

ప్రజాశక్తి - సామర్లకోట



సమావేశంలో మాట్లాడుతున్న చంద్రావతి

శ్రామిక మహిళల సమస్యల పరిష్కా రంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చిత్తశుద్ధి కన్పిం చడం లేదని ప్రజా సంఘాల నాయకులు అన్నారు. బుధ వారం స్థానిక సిఐటియు భవన్‌లో శ్రామిక మహిళ సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో అంతర్జా తీయ మహిళా దినోత్సవం జరిగింది. ఈ కార్య క్రమంలో అంగన్‌వాడీ వర్కర్ అండ్ హెల్పర్స్ యూనియన్ కార్యదర్శి ఎస్తేరురాణి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ యూని యన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇ.చంద్రావతి, ఐద్వా జిల్లా కార్యదర్శి వరలక్ష్మీ పాల్గొని మాట్లాడారు. దేశంలో మతోన్మాదం మహిళల హక్కులకు ప్రధాన శత్రువని, పురుషా ధిక్యతకు వ్యతిరేకంగా మహిళలు నిరంతర పోరా టం నిర్వహించడం ద్వారా సమాన హక్కులు సాధిం చుకోగలమని అన్నారు. కేంద్రంలోని బిజెపి, రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వం మాట వరసకు మాత్రమే మహిళా సాధికారత అనే పదాన్ని వాడతున్నాయని, డబ్బులు పంచడమే మహిళా సాధికారతా అని ప్రశ్నించారు. గౌరవ వేతనం పేరుతో అంగన్‌వాడీ, ఆశ, మధ్యాహ్నం భోజనం, యానిమేటర్లను ప్రభుత్వాలే దోపిడీ చేస్తున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాలకు చెందిన నాయకులు దాడి బేబి, టి.నాగమణి, బాలం లక్ష్మీ, జి. మహాలక్ష్మీ, లోవకుమారి, మంగా లక్ష్మీ, వాణి, రజనీ, రాజేశ్వరి, కె.ప్రసాదరావు, బాలం శ్రీను, సింహాచలం, సత్తిబాబు పాల్గొన్నారు.

సర్పవరం జంక్షన్‌లో నాకాబందీ



తనిఖీలు చేస్తున్న పోలీసులు

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

రూరల్ మండలం సర్పవరం జంక్షన్ వద్ద బుధవారం సిఐ వైఆర్‌కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో నాకభందీ కార్యక్రమాన్ని పోలీసులు నిర్వహించారు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో అసాంఘిక కార్యకలాపాలను అడ్డుకునే లక్ష్యంతో వెళ్లి వచ్చే ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీలు చేపడుతున్నట్లు సిఐ తెలిపారు. ప్రశాంత వాతావరణంలో ప్రజలు ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఈ ప్రక్రియ దోహదం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సిఐ చైతన్యకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

చలో ఢిల్లీకి మద్దతు తెలపండి

ప్రజాశక్తి - తాళ్లరేవు

ఈ నెల 14న జరుగుతున్న చలో ఢిల్లీకి ప్రజలు, రైతులు, ప్రజా సంఘాలు మద్దతుగా నిలవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు టేకుమూడి ఈశ్వరరావు పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం ఆయన ఓ ప్రకటనను విడుదల చేశారు. మద్దతు ధరల గ్యారెంటీ చట్టం, రైతులు రుణాలు మాఫీ, మోడీ ప్రభుత్వ రైతాంగ వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా లక్షలాది మంది రైతులు, కౌలు రైతులు నిరసనకు దిగుతున్నారని తెలిపారు.

ఎస్‌పిఎఫ్ పోలీసులకు ఆరోగ్య పరీక్షలు

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

ట్రస్ట్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ (ఎపిఎస్‌పిఎఫ్) సిబ్బందికి ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఎస్‌పిఎఫ్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ త్రివిక్రమ్ వర్మ వర్చువల్ విధానంలో ప్రారంభించారు. ఈ శిబిరంలో సీనియర్ జనరల్ ఫిజిషియన్, డయాబెటాలజిస్ట్ డాక్టర్ ఫణిరమణ, డాక్టర్ సనా ప్రవీణ్, నెఫ్రాలజిస్ట్ డాక్టర్ లక్ష్మి, నేత్ర వైద్య నిపుణుడు డాక్టర్ నిశాంత్, సీనియర్ కార్డియాలజిస్ట్ డాక్టర్ సురేష్, కార్డియాలజిస్ట్ సూపర్ స్పెషలిస్ట్‌లు వైద్య సేవలందించారు. ట్రస్ట్ హాస్పిటల్స్ అందించిన స్వచ్ఛంద ఆరోగ్య సంరక్షణ సేవలను డాక్టర్ త్రివిక్రమ్ వర్మ ప్రశంసించారు. ఈ శిబిరంలో సుమారు 200 మందికి పైగా ఎస్‌పిఎఫ్ సిబ్బందికి వైద్య సేవలు అందించారు. ఈ శిబిరం నిర్వహణకు సహకరించిన ట్రస్ట్ హాస్పిటల్స్ ఎండీ డాక్టర్ వై.కళ్యాణ్‌చక్రవర్తి, డాక్టర్ రామకృష్ణ, ట్రస్ట్ హాస్పిటల్ డైరెక్టర్ బసవ శ్రీనివాసరావులను ఆయన అభినందించారు.

మహా శివరాత్రి ఆదాయం రూ.29.46 లక్షలు

ప్రజాశక్తి - సామర్లకోట



విరాళాలను లెక్కిస్తున్న సిబ్బంది, సేవకులు

స్థానిక భీమేశ్వరుని ఆలయం వద్ద నిర్వహించిన మహా శివరాత్రి సందర్భంగా దేవాలయానికి రూ.29,46,474 ఆదాయం వచ్చిందని ఆలయ ఇఒ బళ్ళ నీలకంఠం తెలిపారు. బుధవారం ఆలయంలో హుండీలను తెరిచి ఇఒ ఆధ్వర్యంలో లెక్కించారు. దర్శనం టికెట్ల ద్వారా రూ. 9,00,910లు, వివిధ సేవల ద్వారా రూ. 92,517లు, అన్నదానానికి రూ.5,05,922లు, హుండీల ద్వారా రూ.12,00,080లు, లడ్డూ ప్రసాదం ద్వారా రూ.1,42,815లు, పులిహోర విక్రయాల ద్వారా రూ.1,04,830లు వెరసి రూ.29,46,474 ఆదాయం వచ్చినట్టు చెప్పారు. గతేడాది మహా శివరాత్రి ఉత్సవాల సందర్భంగా రూ.25,26,555 ఆధాయం రాగా ఈ ఏడాది రూ. 4,19,919లు ఆదాయం అదనంగా వచ్చినట్టు ఆలయ అధికారి నీలకంఠం చెప్పారు.

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల పరిశీలన

ప్రజాశక్తి - పెదపూడి

మండలంలో గుర్తించిన సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను పెదపూడి, గొల్లలమామిడాడ గ్రామాలలో కాకినాడ రూరల్ సిఐ కే.శ్రీనివాస్ బుధవారం పరిశీలించారు. ప్రజలతో మాట్లాడి గత ఎన్నికల్లో గ్రామాల్లో జరిగిన గొడవలు, ఇతర సమస్యల గురించి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు కల్పించామని, ఎలాంటి భయం లేకుండా ప్రజలు ఓటు హక్కును విని యోగించుకోవాలని సూచించారు. ఎన్నికలను ప్రశాంతంగా, పకడ్బందీగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ కె.రాజకుమార్, ఎస్ఐ శోభన్‌కుమార్ పాల్గొన్నారు.

లబ్ధిదారులకు హక్కుపత్రాల పంపిణీ

ప్రజాశక్తి - తాళ్ళరేవు, పెద్దాపురం



తాళ్లరేవులో పట్టాలు పంపిణీ చేస్తున్న ఎంఎల్ఎ పొన్నాడ సతీష్‌కుమార్

మండలంలోని కోరంగిలోని క్రైట్ మహిళా కళాశాల ప్రాంతంలో పటవల పంచాయతీ పరిధిలోని నాలుగు ఆవాసాలకు చెందిన లబ్ధిదారులకు స్థలాలకు హక్కు పత్రాలను పంపిణీ చేశారు. బుధవారం జరిగిన ఈ కార్యక్రమంలో ఎంఎల్ఎ పొన్నాడ సతీష్‌కుమార్ పాల్గొన్నారు. వైసిపి గ్రామ కమిటీ కన్వీనర్ కాలా వెంకటరమణ అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ పట్టాలు పొందిన లబ్ధిదారులందరూ ఇండ్లు నిర్మాణం చేసుకునేందుకు హౌసింగ్ రుణాలు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. ఒక్కొక్కరికి రూ. 1 లక్షా 80 వేల తోపాటు, అదనంగా డ్వాక్రా రుణం రూ. 50 వేలు బ్యాంకు ద్వారా అందిస్తామన్నారు. అన్ని హంగులతో నూతన జగనన్న కాలనీ నిర్మించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ పినపోతు చిన్నకామేశ్వరరావు, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కొటికలపూడి చంద్రశేఖర్, కొప్పిశెట్టి వెంకట్, చక్కపల్లి లక్ష్మణ్, తనుకు సత్యనారాయణ, ఇఒపిఆర్‌డి మల్లాడి భైరవమూర్తి, పంచాయితీ కార్యదర్శులు రమణమ్మ, మోహన్, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.నవరత్నాలు, అందరికీ ఇళ్ల పథకంలో మంజూరు అయిన లబ్ధిదారులకు స్థలాలకు సంబంధించి హక్కు పత్రాల పంపిణీ కార్యక్రమం జరిగింది. బుధవారం మండలంలోని జె తిమ్మాపురం, కట్టమూరు, దివిలి, పులిమేరు, చదలాడ, వడ్లమూరు గ్రామాల్లో లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ హక్కు పత్రాల పంపిణీ జరిగింది. ఈ కార్యక్రమంలో వైసిపి నియోజక వర్గ ఇన్‌ఛార్జ్ దవులూరి దొరబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేసిన ఘనత సిఎం జగన్‌దేనని అన్నారు. ఈ కార్యక్రమంలో జడ్‌పిటిసి సభ్యులు గవరసాన సూరిబాబు, ఎంపిపి పెంకే సత్యవతి, వైస్ ఎంపిపి మిర్యాల రాజా, నియోజకవర్గ పరిశీలకులు చీకట్ల కిషోర్, వైసిపి రాష్ట్ర కార్యదర్శి కంటే వీర రాఘవరావు, తదితరులు పాల్గొన్నారు.

మహిళా సాధికారత కోసం మరో ముందడుగు



మీడియాతో మాట్లాడుతున్న రాజప్ప

ప్రజాశక్తి - సామర్లకోట

మహిళా సాధికారత దిశగా టిడిపి అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ మరో అడుగు వేయడం జరిగిందని టిడిపి నియోజకవర్గ అభ్యర్థి, సిట్టింగ్ ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. మండలంలోని తన క్యాంపు కార్యాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. కలలకు రెక్కలు అనే పేరుతో ఓ సరికొత్త పథకాన్ని మహిళల కోసం తీసుకొచ్చారన్నారు. రాష్ట్రంలో ఆర్థిక కారణాలతో ఏ ఆడబిడ్డ చదువుకు దూరం కాకుడదనే లక్ష్యంతో నూతన పథకాన్ని తీసుకొస్తున్నట్లు చెప్పారు. మహిళలకు వృత్తిపరమైన విద్యకు మార్గాలను అందించడంతోపాటు వారికి ఉపాధి అవకాశాలు కల్పించడం ఈ పథకం లక్ష్యమన్నారు. ఇంటర్మీడియట్‌ను విజయవంతంగా పూర్తి చేసిన మహిళలు ఈ పథకం కింద దరఖాస్తు చేసుకునేందుకు అర్హులని అన్నారు. ఈ పథకంలో నమోదు చేసుకున్న మహిళలు తీసుకునే బ్యాంక్ రుణానికి రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత తీసుకుంటుందన్నారు. ఈ పథకంలో విద్యను అభ్యసించేందుకు తీసుకున్న రుణానికి కూడా ప్రభుత్వం వడ్డీని చెల్లిస్తుందని తెలిపారు.